

సాక్షి బాపట్ల

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6034 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 35,019 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 36,760 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.

శతాధిక వృద్ధురాలు మృతి



చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలకు చెందిన శతాధిక వృద్ధురాలు కార్యంపూడి లక్ష్మీకాంతమ్మ (104) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



వైద్య కళాశాలలను ప్రైవేటీకరించటం, సీట్లను తిరస్కరించటం మా లాంటి విద్యార్థులకు నిరాశే. ఎంతో కష్టపడి నీట్ పరీక్షలు రాసి మంచి ర్యాంకులు సాధించిన ప్రతికీ సీటు వస్తుందో, రాదో తెలియక ఆందోళన చెందుతున్నాం. కేటగిరీల వారీ కాకుండా అన్ని సీట్లు ఫ్రీ సీట్లుగా కేటాయించి నీట్‌లో ర్యాంకులు సాధించిన వారందరికీ సీట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలి.

- మామిడిబత్తుల స్వామి అయ్యప్ప, నీట్ రాసిన విద్యార్థి, మచిలీపట్నం



ప్రైవేటు పరం చేయటం అన్యాయం



ప్రభుత్వ వైఖరి మారాలి వైద్య విద్య పేద విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కృషి చేశారు. అయితే ఇప్పుడు మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయటం చాలా అన్యాయం. మంజూరైన సీట్లు వదిలేశారు. పేద విద్యార్థులు వైద్య విద్య ఎలా చదవగలుగుతారు..? ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి.

- సమీర్ అహ్మద్, విద్యార్థి, కానూరు



పోతార్లంక వద్ద మొక్కజొన్న



కొల్లూరు కరకట్ట దిగువన బొప్పాయి



పెదలంక వద్ద పచ్చి మిర్చి



గాజుల్లంక వద్ద అరటి

కష్టం కొట్టుకుపోయే..

చెమటను ధారపోసి..శ్రమను పెట్టుబడిగా పెట్టి సాగు చేసిన పంటలను వరద తుడిచిపెట్టేసింది. నీటి పాలైన పంటలను చూసి అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. మళ్లీ పెట్టుబడి పెట్టేందుకు ఒంట్లో శక్తి సన్నగిల్లిపోయింది. ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం సాయం చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది.

- 11,270 ఎకరాల్లో వాణిజ్య పంటలకు నష్టం
- 40 వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- 16 మండలాల పరిధిలో వరికి నష్టం
- మూడు మండలాల పరిధిలో దెబ్బతిన్న వాణిజ్య పంటలు
- కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరులో దెబ్బతిన్న అరటి, పసుపు
- కంద, తమలపాకు, జామ పంటలకూ నష్టం
- పరిహారంపై స్పష్టత ఇవ్వని చంద్రబాబు సర్కారు
- ఆందోళనలో బాధిత రైతులు



పాడైపోయిన పసుపు పంట

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వారం పదిరోజులపాటు కృష్ణా వరదనీటిలో మునిగి జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగైన వరితోపాటు వాణిజ్య పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో మొక్కుబడిగా కూడా సాయమందించే పరిస్థితి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.20 వేలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులపట్ల ఉదారత చూపించలేక పోతున్నారు.

వాణిజ్య పంటలు నీటి పాలు

వేమూరు నియోజకవర్గంలో పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, తోకలవారిపాలెం, కృష్ణనగర్, కిష్కిందపాలెం, జువ్వలపాలెం, చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతల్లంక, పెదలంక, తిప్పలకట్ట, తడికలపూడి, భట్టిప్రోలు మండలంలో పెదలంక, పెసర్లంక, చింతమోటు, పల్లిపాలెం, రేపల్లె మండలంలో పల్లిపాలెం, లంకివేనిదిబ్బ, పిరాటలంక, బొబ్బరలంక, రావి అనంతవరం గ్రామాలు వరద నీటిలో చిక్కుకొని జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో 11,270 ఎకరాల్లో సాగుచేసిన పసుపు, అరటి, కంద, జామ, తమలపాకు, సన్న నిమ్మ, పామాయిల్, బొప్పాయి, పూలు, కూరగాయల పంటలు పూర్తిగా పాడవడంతో రూ.200 కోట్లమేర నష్టం వాటిల్లింది. దీంతో 8,468 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన వారిలో అధికశాతం మంది కౌలు రైతులే కావడం గమనార్హం. వారంతా ఎకరం రూ.50 వేలు చొప్పున కౌలు చెల్లిస్తున్నారు.

40 వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంట

వరదలతో జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలలోని 16 మండలాల పరిధిలో 40 వేల ఎకరాల్లో వరిపంట పూర్తిగా పాడైంది. ఈ మేరకు అధికారులు వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వరిపంటకు ఎకరానికి రూ.10 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ఇటీవల ప్రకటించినా ఆ మేరకు జీవో విడుదల కాకపోవడంతో అధికారులు పాత జీవో ప్రకారం ఎకరాకు రూ.6,800 చొప్పున అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. తీవ్రంగా నష్టపోయినందున ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కోట్లలో పెట్టుబడులు

కంద పంటకు ఎకరాకు రూ.2.50 లక్షల పెట్టుబడులు పెట్టగా పసుపుకు రూ.1.50, అరటి, జామ, కూరగాయలు, బొప్పాయి పంటలకు సైతం రూ.1.50 లక్షలు పెట్టుబడులు కాగా తమలపాకు పంటకు రూ.2 లక్షల పెట్టుబడులు పెట్టారు. ఈ లెక్కన 1,473.8 హెక్టార్ల అరటి సాగుకు రూ.55.26 కోట్లు పెట్టుబడులు కాగా 1,338.4 హెక్టార్ల పసుపు సాగుకు రూ.50.19 కోట్లు, 820.8 హెక్టార్ల కంద సాగుకు రూ.51.30, 135.40 హెక్టార్ల తమలపాకు సాగుకు రూ. 6.76, 57.5 హెక్టార్ల జామ సాగుకు రూ.2.16, 175 హెక్టార్ల కూరగాయల సాగు కోసం రూ. 6.55 కోట్లు చొప్పున మొత్తం రూ.172.23 కోట్ల పెట్టుబడులు పెట్టగా ఇవికాకుండా వెయ్యి ఎకరాల్లో సాగైన సన్న నిమ్మ, బొప్పాయి, బెండ, పూలు తదితర పంటల సాగుకు సుమారు రూ.30 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ లెక్కన మొత్తం వాణిజ్య పంటలకు రూ.200 కోట్లకు తగ్గకుండా రైతులు పెట్టుబడులు పెట్టారు.

పంటపేరు	దెబ్బతిన్న పంటల విస్తీర్ణం (హెక్టార్లలో)	నష్టపోయిన రైతులు
అరటి	915.80	1974
కొబ్బరి	30	20
పూలు	08	13
జామ	7.50	06
పామాయిల్	4	04
బొప్పాయి	5	08
పసుపు	848.40	1574
కంద	464.80	862
తమలపాకు	135.40	420
కూరగాయలు	113	290
భట్టిప్రోలు మండలంలో...		
అరటి	550	861
సన్ననిమ్మ	3	02
పసుపు	490	810
కంద	356	575
జామ	50	110
బొప్పాయి	4	06
కూరగాయలు	56	41
చుండూరు మండలంలో...		
అరటి	8	14
కూరగాయలు	6	18
సన్ననిమ్మ	560	860
	4,614.90	8,468



చిలువూరు లంక వద్ద వంగ తోట



తిప్పలకట్ట వద్ద వరదకు కూలిపోతున్న తమలపాకు తోట

మొక్కుబడిగా ఇన్‌పుట్ సబ్సిడీ

రాష్ట్ర విపత్తుల విభాగం నిబంధనల మేరకు వాణిజ్య పంటలకు హెక్టారు అరటికి రూ.25 వేలు, కంద, పసుపుకు 18 వేలు, నిమ్మకు 22, వెజిటబుల్స్ 18, తమలపాకు(కేవలం ఎకరాకు మాత్రమే) రూ.30 వేలు చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఎకరా అరటికి రూ.10 వేలు మాత్రమే రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద వస్తుండగా పసుపు, కంద, విజిటబుల్స్‌కు ఎకరాకు రూ.7,500, నిమ్మకు రూ.8,500 మాత్రమే వస్తుంది. ఎకరాకు లక్షల్లో పెట్టుబడులు పెట్టిన వాణిజ్య పంటలు ప్రభుత్వం మొక్కుబడిగా పరిహారం ఇవ్వనుండడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పవర్ లిఫ్టింగ్‌లో ఏల్చూరి మహిళకు బంగారు పతకం



సంతమాగులూరు (అద్దంకి): రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏల్చూరి మహిళకు బంగారు పతకం లభించింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో ఈ నెల 14,15వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంతమాగులూరు మండలంలోని ఏల్చూరుకు చెందిన పర్చూరి నంద ప్రథమ స్థానం పొందారు. నంద వృత్తి రీత్యా న్యాయవాది. చిన్నతనం నంచే పవర్ లిఫ్టింగ్‌పై మక్కువ పెంచుకుని ఎన్నో పతకాలను సాధించారు. 76 కిలోల బాడీవెయిట్ విభాగంలో నంద జిల్లా తరుపున 265 కిలోల బరువును లిఫ్ట్ చేసి రెండో స్థానంలో నిలిచింది. బెంచ్ ప్రెస్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించింది. ఆమెను తోటి న్యాయవాదులు, గ్రామస్తులు అభినందించారు. ప్రపంచస్థాయి పోటీల్లో ఇండియా తరపున పాల్గొని బంగారు పతకం తేవాలనే ఆకాంక్ష ఉన్నట్లు నంద చెప్పింది.

వినాయకుడికి 134 రకాల ప్రసాదాలు



తాడేపల్లి రూరల్: ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహానికి సోమవారం 134 రకాల ప్రసాదాలను కమిటీ సభ్యులు తయారుచేసి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాధారణంగా గణేష్ ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహిస్తారని, తాము 15 రోజులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

స్మార్ట్ మీటర్లు రంగ ప్రవేశం

- నరసరావుపేటలో 200 మీటర్లు ఏర్పాటు
- మొదటి ఫేజ్‌లో ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్ల అవసరాలకు ఏర్పాటు
- తొలుత సింగిల్ ఫేజ్ మీటర్ల బిగింపు, త్వరలో త్రీఫేజ్ రాక



పట్టణంలో వివిధ ప్రదేశాల్లో బిగించిన స్మార్ట్ మీటర్లు


నరసరావుపేట: జిల్లాలో వినియోగదారులు వాడుకునే విద్యుత్ సామర్థ్యాన్ని కొలిచి తగిన సొమ్ము చెల్లించేందుకు స్మార్టు మీటర్లు రంగ ప్రవేశం చేశాయి. ఇప్పటివరకు వినియోగిస్తున్న ఐఆర్‌డీ మీటర్లకు కాలం చెల్లనుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సర్వీసులకు మాత్రమే సింగిల్ ఫేజ్ స్మార్టు మీటర్లు ఆశాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేట పట్టణంలో సుమారు 200 సర్వీసులకు ఏర్పాటు చేశారు. మరో 800 వరకు బిగించాల్సి ఉందని చెబుతున్నారు. ఈ మీటర్లలో సిమ్ ఉంటుంది. సెల్‌ఫోన్ల మాదిరిగానే ముందుగానే డబ్బులు చెల్లించి వాటిని వినియోగించుకునే అవకాశం భవిష్యత్‌లో వినియోగదారులకు కలుగుతుంది. దీంతోపాటు అధికారులకు వినియోగదారుడు ఏ మేర విద్యుత్ వినియోగిస్తున్నాడనే విషయం ప్రతి అరంగటకు అతనికి, అధికారులకు సమాచారాన్ని అందజేస్తుంది. ప్రతి నెలా మీటరు వద్దకు వచ్చి రీడింగ్ తీసుకునే అవసరం విద్యుత్‌సిబ్బందికి తప్పుతుంది. ప్రస్తుతమైతే పాత పద్ధతి పోస్ట్‌పెయిడ్‌లోనే బిల్లు చెల్లించుకుంటారు. రానున్న రోజుల్లో ప్రీపెయిడ్ విధానంలో ముందస్తుగా డబ్బులు చెల్లించి రీచార్జి చేసుకొని విద్యుత్‌ను వాడుకునే అవకాశం ఉంటుంది. ఈ మీటర్లను ఆదాని గ్రూప్ ద్వారా ప్రభుత్వానికి సరఫరా అవుతున్నాయి. తొలుత ప్రభుత్వం కార్యాలయాలు, వీధిలైట్లు, ఇతర ప్రభుత్వ వాడకాలకు ఉపయోగించేందుకు ఏర్పాటుచేస్తున్నారు. ఆ తర్వాత గృహావసరాలకు ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుతం సింగిల్ ఫేజ్ మీటర్లనే బిగిస్తున్నారు. త్వరలో త్రీ ఫేజ్ మీటర్లు కూడా రానున్నాయి. దీనిపై ఏడీఈ ఏడుకొండలను వివరణ కోరగా స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ ముందుగా డబ్బులు చెల్లించి దానికి తగ్గట్టుగా విద్యుత్‌ను వాడుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

మృగ్యమైన మానవత్వం

సూర్యలంకలో వ్యక్తి దారుణ హత్య

మాయమైపోతుందమ్మా.. మనుషుల్లో మానవత్వం.. అయ్యా.. నన్ను కాపాడండయ్యా.. అంటూ ఆ వ్యక్తి పెట్టిన కేకలు చుట్టూ మూగిన రాతిగుండెలను కదిలించలేకపోయాయి. 108 వాహనం వచ్చేవరకు విలువైన సమయం వృథా చేయకుండా.. తమ వాహనాల్లో ఆ అభాగ్యుణ్ణి తీసుకెళ్లి బతికించే ప్రయత్నం చేయలేకపోయారు. అరిచి, అరిచి తానే గాయంపై ఓ చేయి వేసుకుని, ఇంకో చేత్తో బైక్ తీసి ఆస్పత్రికి వెళదామంటూ తీసి, కొంతదూరం పోనిచ్చి.. ఇక పోలేనంటూ.. కిందకి వాలిపోయాడు. దాదాపు 45 నిమిషాలపాటు మృత్యువుతో పోరాడి.. ఇక పోరాడలేనంటూ దాని ఒడిలోకి చేరాడు.

- ఆర్థిక వ్యవహారాలే హత్యకు కారణం
- సుమారు 45 నిమిషాలు మృత్యువుతో పోరాడి మృతి
- జాడేలేని 108.. పట్టించుకోని చుట్టూమూగిన జనం



కత్తి గాటుకు రక్తం కారకుండా పట్టుకున్న యేసుబాబు

బాపట్ల: ఆర్థిక లావాదేవీల కారణంగా ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బాపట్ల జిల్లా సూర్యలంక సమీపంలో చోటుచేసుకుంది. కత్తిపోటుకు గురైన వ్యక్తి తన ప్రాణాలు కాపాడుకోవాలంటూ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చేతులు జోడించి కాపాడాలని కోరినా ఎవరూ ముందుకు రాకపోవడం మనుషుల్లో మానవత్వం మాయమవుతుందన్న ఘటనకు నిదర్శనంగా నిలిచింది. మరోవైపు 108గానీ, పోలీసులు వెంటనే స్పందించకపోవటంతో సుమారు 45నిమిషాలకుపైగా మృత్యువుతో పోరాడి మరణించాడు'. ఇది అంతా నిత్యం రద్దీగా ఉండే సూర్యలంక సముద్రతీరం వద్ద సోమవారం సాయంత్రం 4.45గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది.



బతికేందుకు పోరాడి మృతిచెందిన యేసుబాబు

మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల పట్టణానికి చెందిన బి.యేసుబాబు(47) చిన్న, చిన్న వడ్డీ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల గుమాస్తాగా కొక్కిలిగడ్డ చంద్రశేఖర్ అలియాస్ చిన్నూను నియమించుకున్నాడు. యేసుబాబుకు చంద్రశేఖర్‌తో ఆర్థిక పరమైన వ్యవహారాల్లో వివాదాలు ఉన్నాయి. చంద్రశేఖర్ సోమవారం మధ్యాహ్నం యేసుబాబుకు ఫోన్ చేయటంతో సూర్యలంక వెళుతున్నానంటూ చెప్పి వెళ్లి, ఇలా హత్యకు గురయ్యాడంటూ యేసుబాబు భార్య బోరున విలపించింది. ఒకచేత్తో ద్విచక్రవాహనం నడుపుతూ మరో చేత్తో గొంతుకు ఉన్న గాయం నుంచి రక్తం కారకుండా అడ్డుపెట్టుకుని యేసుబాబు సూర్యలంక తీరానికి చేరుకున్నాడంటూ స్థానికులు తెలిపారు. తనను చిన్నూ అలియాస్ చంద్రశేఖర్ కత్తితో పొడిచాడంటూ చెబుతూ 108కి ఫోన్ చేయండి... కాపాడండంటూ ప్రాథేయపడుతూ సుమారు 45 నిమిషాలు తరువాత కన్నుమూశాడు. చుట్టూ మూగిన జనం వీడియోలు తీస్తూ కాలక్షేపం చేశారే తప్ప కాపాడే యత్నాలు చేయలేదు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూర్యలంక సమీపంలోని తోటల్లో చంద్రశేఖర్ అలియాస్ చిన్నూ యేసుబాబును కత్తితో పొడిచి, హత్యచేసినట్లు భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



రూ. 7 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లి రెడ్ల రామ మందిరం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వేలం నిర్వహించగా 116 కిలోల లడ్డూ రూ. 7 లక్షలు పలికింది.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుంటూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

– గుంటూరు



క్లుప్తంగా

బాడీ బిల్డింగ్ పోటీల్లో చీరాల యువకుల సత్తా



చీరాల: బాడీ బిల్డింగ్ పోటీలలో చీరాల కుర్రోళ్లు సత్తా చాటారు. ఈనెల 15న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో 55 కేజీల విభాగంలో చీరాల రూరల్ మండలం పాతచీరాలకు చెందిన సూరిన భాస్కర్‌రెడ్డి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలానే 50 కేజీల విభాగంలో చీరాల రూరల్ మండలం పాతచీరాలకు చెందిన మేరుగు కిషోర్ నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తమ విజయానికి దోహదపడిన ఫిట్‌నెస్ జిమ్ ట్రైనర్ గుమ్మడి బూన్‌కు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.

పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపుదలకు కృషి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమానికి బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న 67 మందిని అభినందించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన అందించినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడు సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దగలరని అభిప్రాయపడ్డారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువకుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- మద్యం మత్తులో ద్విచక్రవాహనం నడిపిన యువకుడు
- పాదచారిని ఢీకొట్టి ఆపై ఆటోను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే మృతిచెందిన పాదచారి
- మృతుడు ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్

చీరాల: యువకుడి నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతూ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి ఢీకొనడంతోపాటు వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా ఉన్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. మితిమీరిన వేగానికి నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఘటనా స్థలంలో మృతుడి భార్య విలపించిన తీరు అందరిని కలిచివేసింది. ఈ హృదయ విదారక ఘటన సోమవారం చీరాల మండలం జాండ్రపేటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చీరాల రూరల్ మండలం జాండ్రపేటలోని గుమస్తాల కాలనీకి చెందిన అచ్చుతుని ఫణికుమార్ (43) చీరాల ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం పాలు తీసుకువచ్చేందుకు బయటకు వచ్చాడు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న అతడిని మద్యం తాగి మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న రవీంద్ర ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం వేగానికి ఫణికుమార్ పక్కన ఉన్న గోడకు తగలడంతో బలమైన గాయంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ద్విచక్రవాహనం వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా ఉన్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. దెబ్బతిన్న ఆటోను చూస్తే యువకుడు వచ్చిన వేగం ఏమిటో అర్థమవుతుందని స్థానికులు



భర్త మృతదేహాన్ని చూసి గుండె పగిలేలా రోదిస్తున్న భార్య

చెప్తున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య ప్రమాద స్థలంలో విగతజీవిగా ఉన్న భర్తను చూసి గుండెలు పగిలేలా పెట్టిన రోదనలు చూసి అందరూ కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి అచ్చుతుని బాబూరావు చీరాల ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. కుమారుడి మరణవార్త తల్లికి తెలియదని, తెలిస్తే ఆమె కూడా తనకు దూరమైపోతుందని బాబూరావు కన్నీటి పర్యంతమయ్యాడు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఒకరి ప్రాణం పోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీపీఐ, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు మేడ వెంకట్రావు, బత్తుల శామ్యూల్, చిరమల ప్రకాష్, కేవీ రావులు ఆయనకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



ద్విచక్రవాహనం ఢీకొని దెబ్బతిన్న ఆటో



పాదచారిని ఢీకొన్న ద్విచక్రవాహనం

ఆర్టీసీ తరఫున ఆర్థికసాయం అందజేత

ఆర్టీసీ చీరాల డిపో గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్న ఫణికుమార్ మృతిచెందిన సంగతి తెలియడంతో ఆర్టీసీ తరుపున తక్షణ సహాయంగా రూ.25 వేలు మృతుడి తండ్రికి డిపో మేనేజర్ జె.శ్యామల అందించారు. పోస్టుమార్టం అనంతరం ఇంటికి తరలించిన ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అలానే ఆర్టీసీ తరుపున ఇతర సహాయాలను తక్షణమే అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సృజనాత్మకతతో ఉన్నతశిఖరాలకు..

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- పోస్టర్ ప్రజెంటేషన్‌లో జాతీయస్థాయిలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని భవ్యశ్రీకి అభినందన

బాపట్ల: సృజనాత్మకతను గుర్తిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలబెట్టిన పదో తరగతి విద్యార్థిని భవ్యశ్రీని జిల్లా కలెక్టర్ సోమవారం అభినందించారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటీషన్‌లో జిల్లా విద్యార్థినికి జాతీయస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. బాపట్ల జిల్లా కొండమంజులూరు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ రూపొందించిన పోస్టర్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని భవ్యశ్రీకి స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రూ.10వేల నగదు పారితోషకాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ అందజేశారు. విద్యార్థినికి జ్ఞాపికతో పాటు ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం ఐ.అనిత, డ్రాయింగ్ టీచర్ టి.వెంకటేశ్వరరావులను ప్రత్యేకంగా అభినందించారు. డీఈఓ కె.నారాయణరావు, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, సికిందర్ మీర్జాన్, రామకోటిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని భవ్యశ్రీకి జ్ఞాపిక అందిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

వరద బాధితులకు అండగా ఉద్యోగులు

కొల్లూరు: వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన సొంత గ్రామంలోని కుటుంబాలను ఆదుకోవడానికి బయటి ప్రాంతాలలో స్థిరపడిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు నడుం కట్టారు. మండలంలోని తోకలవారిపాలెంకు చెందిన, ఇతర ప్రాంతాలలో స్థిరపడి ఉద్యోగాలు చేసుకుంటున్న వ్యక్తులు ఒకరికి ఒకరు చేయి కలిపి రూ. 3 లక్షలు విలువైన దుస్తులు, 15 రకాల నిత్యవసరాలను వరద పీడిత కుటుంబాలకు పంపిణీచేశారు. సోమవారం తోకలవారిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి టి.కృష్ణమోహన్, ఇతర ప్రాంతాలలో స్థిరపడిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో కలిసి ముంపు ప్రజలకు సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ, సొంత గ్రామం శ్రేయస్సు కోసం అందరూ సహకరించి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. తోకలవారిపాలెంకు చెందిన ఉద్యోగులు ఎం.అనీల్‌కుమార్, వి.పూర్ణచంద్రరావు, వి.పోతురాజు, వి.రంజిత్‌కుమార్, అంబటి కిరణ్‌బాబు, వాగోలు తిరుమలసాగర్, వర్రె నాగరాజు, దేశాంగరాజు, వాగోలు శివకృష్ణ, ఎడ్ల శ్రీను, చలపతిరావు, వర్రే కోటేశ్వరరావు, వర్రె అనిత తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు, సర్పంచి

చిన్నారుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి




చినగంజాం: కన్నతల్లి చనిపోవడంతో బిడ్డల సంరక్షణ కరువైన చిన్నారుల రక్షణ, సంరక్షణ విద్యను అందించే బాధ్యతలను పూర్తిగా ప్రభుత్వమే తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. చినగంజాం గ్రామంలోని జాలమ్మకాలనీకి చెందిన మానికల సుబ్రహ్మణ్యం, లక్ష్మిలకు తొమ్మిదిమంది సంతానం. తొమ్మిదో చిన్నారిని కనే పరిస్థితిలో గుంటూరు జీజీహెచ్‌లో తల్లి చనిపోగా ఆ చిన్నారిని పోషించలేని పరిస్థితిలో తండ్రి విక్రయించేందుకు ప్రయత్నించడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. దీనిపై గుంటూరులో కేసు నమోదు కావడంతో ఆ చిన్నారిని రక్షించి గుంటూరులోని శిశుగృహంలో ఉంచారన్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని గురించి తాను వాకబు చేశానని, ఆరోగ్యం, రక్షణ, గురించి అడిగి తెలుసుకున్నాని చెప్పారు. తండ్రి దగ్గర ఉన్న మిగతా పిల్లలు గురించి ఆరా తీసి అతనిని కలిసి అధికారుల ద్వారా అతని దగ్గర ఉన్న మిగిలిన ఆడపిల్లలను జిల్లా బాలసదన్‌లో చేర్పించేందుకు అధికారుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి ఒప్పించాన న్నారు. అతని దగ్గర ఉన్న నలుగురు బాలికలను బాపట్ల బాలసదన్‌లోను, 6వ తరగతి వరకు పూర్తి చేసినవారు ఉంటే వారిని కస్తూర్బా బాలికా విద్యాలయంలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పరంగా ఆ చిన్నారులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

క్రికెట్ అండర్-14 ఉమ్మడి ప్రకాశం జట్టు ఎంపిక



మేదరమెట్ల: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–14 జిల్లాస్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని ఆర్ఎస్‌సీపీ స్టేడియంలో సోమవారం ఎంపిక జరిగింది. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో మాజీ రంజీ క్రీడాకారులు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఆదివారం, సోమవారం నిర్వహించిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరచిన క్రీడాకారులను పోటీలకు ఎంపిక చేశారు. మొత్తం 33 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా వీరిలో 16 మందిని ఎంపిక చేశారు. అలాగే ఐదుగురు క్రీడాకారులను స్టాండ్ బైగా ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కోచ్‌లు సుధాకర్, చంద్రశేఖర్, సెలక్షన్ కమిటీ సభ్యులు శ్రీకృష్ణ, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో నజీర్‌కు స్వర్ణం



బాపట్ల: ఆంధ్రప్రదేశ్ 11వ రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బాపట్లకు చెందిన షేక్ నజీర్‌కు బంగారు పతకం లభించింది. ఈనెల 13 నుంచి 15వతేదీ వరకు అమలాపురంలో జరిగిన మాస్టర్స్ విభాగంలో 70కేజీల శరీర బరువు విభాగంలో ప్రథమస్థానం దక్కించుకున్నారు. వీటితోపాటు పలు క్రీడల్లో కూడా రాణించిన నజీర్‌కు బాపట్ల క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

సంగీత, సాహిత్యాలలో బాపట్లకు ప్రత్యేకస్థానం

సంగీత కళాకారుడు మోదుమూడి సుధాకర్

బాపట్ల: సంగీత, సాహిత్య రంగాలలో రాష్ట్రంలో బాపట్లకు ప్రత్యేక స్థానముందని, గురు శిష్య పరంపరగా అది నేటికీ కొనసాగుతుండటం ఆదర్శనీయమని ఆకాశవాణి టాప్ గ్రేడ్ సంగీత కళాకారుడు మోదుమూడి సుధాకర్ అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో బాపట్ల జిల్లా రచయితల సంఘం, శ్రీ వాణి కళా నికేతనం, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల సంయుక్త నిర్వహణలో సీనియర్ పాత్రికేయుడు అచ్యుతుని శంభు ప్రసాద్ రచించిన 'మనోన్మని' గేయ సంపుటి ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కళాభిమానులకు బాపట్ల తరగని సంపదని మోదుమూడి అన్నారు. కళాకారులకు ఇక్కడ లభించే ఆదరణ, ప్రోత్సాహం వలన అనేకమంది పద్మశ్రీ అవార్డులను సాధించారన్నారు. నందిరాజు విజయ్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సభను భాగి కృష్ణమూర్తి ప్రార్థన గీతంతో ప్రారంభించగా ప్రముఖ రచయిత కోన రమణరావు కావ్యావిష్కరణ చేశారు. ప్రముఖ సభ వ్యాఖ్యాత డి.వి.ఎం.సత్యనారాయణ కావ్య సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆకాశవాణి, దూరదర్శన్ గాయకులు భమిడిపాటి లలితా మాధవ్, కొడవటిగంటి హిమబిందు, అచ్యుతుని రమాదేవి 'వాగ్గేయకార వైభవం' స్వరార్చనలో పలు గీతాలతో సంగీత కచేరీ నిర్వహించారు. పాలపర్తి ఆంజనేయులు, ఇంద్రకీలాద్రి శర్మ, బి.సురేష్‌బాబు వాద్య సహకారాన్ని అందించారు. బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలాసం వీరాంజనేయులు అతిథులను స్వాగతించగా వేజెండ్ల శ్రీనివాసరావు, అచ్యుతుని కౌండిన్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మనోన్మని గేయ సంపుటి ఆవిష్కరణ

బ్రాహ్మణుల్లో ఐకమత్యం అవసరం

అమరావతి: బ్రాహ్మణులు అభివృద్ధి చెందాలంటే ఐకమత్యంగా ముందుకు సాగాలని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాదశర్మ అన్నారు. సోమవారం స్థానిక యోగాశ్రమంలో నిర్వహించిన అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం పల్నాడు జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రధానకార్యదర్శి దేవళ్ల వసంత సాయినాథశర్మ అధ్యక్షత వహించారు. ఇంద్రకంటి ప్రసాదశర్మ మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో అఖిలభారతీయ బ్రాహ్మణ మహాసంఘం బ్రాహ్మణుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సంస్థ తరపున ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బ్రాహ్మణ యువత కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఉద్యోగ మేళా నిర్వహించటానికి నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ఉద్యోగ మేళాలో సుమారు 150 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు.

జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

పల్నాడుజిల్లా మొదటి సమావేశంలో అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కౌశిక వేంకట నాగ మల్లేశ్వర ప్రసాదశర్మతో పాటుగా జిల్లా కార్యవర్గసభ్యులతో రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రకంటి ప్రసాదశర్మ ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా సభ్యులందరికీ సంస్థ గుర్తింపుకార్డులను అందజేశారు. తొలుత బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం నిర్వహించి శోభాయాత్రగా బ్రాహ్మణులందరూ యోగా శ్రమానికి చేరుకున్నారు. సభలో కోశాధికారి ఆసుండి హనుమాన్ శాస్త్రి, సౌత్ జోన్ కోఆర్డినేటర్ ప్రతాపగిరి సునీల్ కుమార్ శర్మ, సౌత్ జోన్ 4 కో ఆర్డినేటర్ శ్రీశర్మ, రాష్ట్రస్థాయి టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ లంకా ప్రసన్న కుమారశర్మ, ఎంద్రాయి వేద పాఠశాల నిర్వాహకుడు ఘంటశాల చంద్రమౌళీశ్వరశర్మ ప్రసంగించారు.

సెల్ ఫోన్ సర్వీసింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 14నుంచి సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసెస్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సెల్‌ఫోన్ సర్వీసింగ్, టైలరింగ్‌ను యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి పాస్/ ఫెయిల్ అయిన 19 నుంచి 45 సంవత్సరాలలోపు అర్హులని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఫొటోస్టాట్లతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు లేదా 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

విధులు బహిష్కరించిన స్టాఫ్ నర్సులు

- జీజీహెచ్‌లో 12వ రోజుకు చేరుకున్న నిరసనలు
- నల్ల బ్యాడ్జీలు ధరించి సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ప్రదర్శన



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సోమవారం విధులు బహిష్క రించి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిల బడి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. తమ ను రెగ్యులర్ చేసే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయా రు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే మంగళవారం నుంచి అత్యవసరం మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరి, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరాలు విజయవంతం చేయండి

- నేడు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు చోట్ల ఏర్పాటు
- జిల్లా చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడి

నరసరావుపేట: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సహకారంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు రోడ్డులోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియం, వాగ్దేవి డిగ్రీ కాలేజీ ఆవరణ, కాకాని గ్రామం వద్దనున్న జేఎన్‌టీయూ కళాశాలలో ప్రత్యేక రక్తదాన శిబిరాలు జరుగుతాయని చెప్పారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు చైర్మన్ వడ్లమాని రవి, వైస్ చైర్మన్ పీఆర్‌సీ రాజు సహకారం అందిస్తున్నారని అన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా వాసవి, రోటరీ, లయన్స్ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు, ఇతర సేవా సంస్థల సభ్యులు అందరూ పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ సృజన, డాక్టర్ రెహమతుల్లా, మురళి, శ్రీనివాసగుప్తా, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- నారాకోడూరు సమీపంలో దుర్ఘటన
- ఒకరి మృతి.. 15 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- నిమజ్జనానికి వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మరో వాహనం

చేబ్రోలు: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుంది. రెండు వాహనాలు ఢీకొని ఒకరి మృతి చెందగా, 15మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు సంపత్‌నగర్, ఐపీడీ కాలనీలకు చెందిన భక్తులు రెండు భారీ వినాయక విగ్రహాలను నిమజ్జనానికి ట్రాక్టర్, మినీ వ్యాన్‌లో విడివిడిగా చేబ్రోలు మండలం సంగం జాగర్లమూడి వద్ద కొమ్మమూరు చానల్‌కు తెచ్చారు. మార్గంమధ్యలో మండల పరిధిలోని నారాకోడూరు కామధేను ఫీడ్స్ సమీపంలోని మినరల్ వాటర్ ప్లాంట్ ఎదురుగా అప్పటికే నిమజ్జనం నుంచి తిరిగి వస్తున్న మినీ వ్యాన్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ రెండు వాహనాల్లో సుమారు 50మంది వరకు నిమజ్జనానికి వచ్చిన భక్తులు ఉన్నారు. ఈ సంఘటనలో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ప్రమాద సమయంలో భక్తులు హాహాకారాలు మిన్నంటాయి.

నిమజ్జనానికి వచ్చి అనంత లోకాలకు..

ఈ ప్రమాదంలో గుంటూరు నల్ల చెరువుకు చెందిన వేముల శివశంకర్ (26) ప్రాణాలు కోల్పోయాడు. తొలుత తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో రెండు వాహనాల్లోని 15మందికి గాయాలయ్యాయి. ఐపీడీ కాలనీకి చెందిన తేజకు కణితకు, ముఖానికి, కాళ్లు చేతులకు, సంపత్ నగర్‌కు చెందిన వినయ్, కృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను మూడు అంబులెన్స్‌లలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు, వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన వాహనాన్ని లేపుతున్న భక్తులు



తీవ్రంగా గాయపడిన వినయ్‌కుమార్



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు